# మనసా కవ్వించకే!

తెలుగు సినిమాల్లో మనసు మీద ఎన్నో సినిమాలున్నాయి, పాటలున్నాయి. మంచి మనసులు, మూగ మనసులు, లేత మనసులు, తేనె మనసులు, కన్నె మనసులు ఇలా ఎన్నో సినిమాలు వచ్చాయి. అలాగే పాటలు. మనసున మనసై, మనుసున మల్లెల మాలలూగెనే, మనసే అందాల బృందావనం, మనసే కోవెలగా లాటి పల్లవులు (పల్లవ రాజులు కాదు, పల్లవికి బహువచనం); 'మనిషితోటి వేళాకోళం ఆడుకుంటే బాగుంటాది, మనసుతోటి ఆడకు మామా విరిగిపోతే అతకదు మళ్ళా' లాటి చక్కటి మరవలేని మాటలూ, మన మనసుల్ని రంజింపాయి. మరిచిపోకుండా కలకాలం మన మనసుల్లో నిలిచిపోయాయి. ఆత్రేయకి మనసు కవి అనే పేరు కూడా వచ్చింది.

అయితే ఈ మనసు అనేది ఏమిటి అసలు? ఇది శరీరంలో ఒక భాగమా? దీనికి రంగూ రుచీ వాసనా వుందా? దీన్ని మనం కంట్రోల్ చేస్తున్నామా, ఇదే మనల్ని కంట్రోల్ చేస్తున్నదా? మనసుని మన చెప్పు చేతల్లో పెట్టుకుంటే, మోక్షానికి దారి తెలుస్తుందని హిందూ మతం చెబుతున్నది కదా. మన మనసు మన చేతుల్లో లేదా. మరి ఈ భౌతిక ప్రపంచంలో మనం దాని చేతుల్లో వున్నామా? అలా వుంటే ఈ బంధాలనించీ బయటపడే అవకాశం వుందా? ఎలా? ఇవన్నీ సోదాహరణంగా తర్వాత పదహారు సంచికల్లో చెప్పటానికి నేను మనస్తత్వవేత్తనీ కాదు. వేదాంతినీ కాదు. అసలు మనసంటే ఏమిటో సరైన అవగాహన లేనివాడిని. అందుకే మొన్న కారులో ఒంటరిగా ప్రయాణం చేస్తున్నప్పుడు వచ్చిన కొన్ని ఆలోచనలని మీ ముందు పెడుతున్నాను. దీంట్లో మీకు, కొన్ని ప్రశ్నలూ అవి చెలరేపిన నా ఆలోచనా సరళీ కనిపిస్తాయి కానీ, జవాబులు కాదు.

భాషాపరంగా గుండె హృదయం ఎలా అవదో, మెదడు అలాగే మనసు అవదు. అంటే ఒక శారీరక భాగం కాదు. అతను ఆమెకి హృదయం ఇచ్చేస్తాడు కానీ, గుండెని ఇస్తే ఇక ఇంతే సంగతులు. మనసు 'వాపు' చాలమందికి వుండొచ్చు కానీ, మెదడు వాపు కొద్దిమందికి మాత్రమే వస్తుంది.

అసలు మనసు అన్న పదానికి వాడుకపరంగా తెలుగులో ఎన్నో అర్థాలు న్నాయి. ఒక్కొక్క రకంగా చెబితే ఒక్కొక్క అర్థం. మనసు అనే పదానికి అర్థాలేమిటో కొన్ని ఉదాహరణలలో చూద్దాం.

మనసు పెట్టి చదువు - ఏకాగ్రత
నా మనసు మనసులో లేదు - ఆందోళన
ఆమె అతని మీద మనసు పడింది - ఆకర్షణ
అతనామెకి మనసిచ్చేశాడు - ప్రేమ

నా మనసివాళ బాగా లేదు - కలత

అమ్మయ్య మనసు కుదుట పడింది - మనశ్శాంతి

మిరపకాయ బజ్జీల మీద మనసుపడింది. చేయవా? - కోరిక

ఆమె మనసు విరిగిపోయింది - బాధ

మనసారా మెచ్చుకున్నాను - హృదయపూర్వకంగా (మనసూ హృదయం ఒకటయాయి!)

ఆయనది పెద్ద మనసు - విశాల హృదయం (మళ్ళీను)

ఇలా ఎన్నో రకాలుగా మనసు అనే మాటతో మనం ఆడుకుంటున్నామా? మనసే మనతో అన్ని రకాలుగా ఆడుకుంటున్నదా?

ఈ మనసు చేసే ఇంకా కొన్ని పరిశీలించిన కొద్దీ సరదాగా వుంటుంది.

ఆస్టిన్‌లో పెట్రోలు గాలన్‌కి ఒక డాలర్ వుండేది. బుష్‌గారి యుద్ధం పుణ్యమా అని, అది రోజు రోజుకీ పెరిగి దాదాపు గాలన్‌కి రెండు డాలర్లు దాటింది. ప్రతివాళ్ళకీ అదో పెద్ద భారం అయిపోయింది. ఎక్కడికన్నా వెళ్ళాలంటే రెండుసార్లు ఆలోచించేవాళ్ళం. అమెరికా చరిత్రలోనే అవి కనీవిని ఎరుగని ధరలు. క్రెడిట్ కార్డ్ బిల్లు పంపించేటప్పుడల్లా మనసు మారాం చేసేది. యుద్ధం సంగతి ఏమీ తేలక పోయేసరికీ, అక్కడినించీ గాలన్‌కి మూడు డాలర్ల దాకా వెళ్ళింది రేటు. నా మనసు కారెక్కినప్పుడల్లా మూలగటం మొదలుపెట్టింది. కానీ చేసేదేముంది, నోరు మూసు కుని బిల్లు కట్టేయటం తప్ప. ఇప్పుడు రేట్లు కొంచెం తగ్గి, గాలన్‌కి రెండున్నర డాలర్లయాయి. అందరి మనసులూ ఆనందంతో గంతులేస్తున్నాయి. ప్రతివాళ్ళూ దూర ప్రయాణాలు చేస్తున్నారు. అమ్మయ్య రేట్లు తగ్గాయి అనుకుంటున్నారు. ఒక డాలర్ నించీ రెండు డాలర్లకి వెళ్ళినప్పుడు మూలిగిన మనసు, అదే మూడు డాలర్ల నించీ రెండున్నరకి వస్తే సంతోషిస్తున్నది.

అలాగే షాపుకి వెళ్ళినప్పుడు అక్కడ మీకు రెండు చొక్కాలు కనిపిం చాయి. రెండూ బాగున్నాయి. ఒకే రంగు, క్వాలిటీ. మీకు సమపాళ్ళల్లో నచ్చాయి. ఒకటి ఇరవై డాలర్ల చొక్కా ఇరవై డాలర్లకే లభ్యమవుతున్నది. రెండవది నలభై డాలర్ల చొక్కా పాతిక డాలర్లకి సేల్లో వుంది. మీరేది కొంటారు?

25 మైళ్ళ పరుగు పందెంలో అందరికన్నా ముందు రాముడూ భీముడూ వున్నారు. భీముడు బలవంతుడు కనక వంద గజాలు ముందున్నాడు. ఇద్దరూ బాగా అలిసిపోయారు. కాకపోతే రాముడు కొంచెం ఎక్కువ అలిసిపోయాడు. రాముడి కాళ్ళు తడబడుతున్నాయి. వనవాసం సీన్‌లో హనుమంతుడి సహాయం లేకుండా ఆ రాముడు గెలవలేకపోయాడు, ఇప్పుడు ఒంటరిగా ఈ రాముడేం గెలుస్తాడు అను కుంటున్నారు అందరూ. మిగిలిన ఒక్క మైలు దూరం పూర్తి చేయగలడా అని అందరికీ అనుమానంగానే వుంది. పరుగెడుతున్న రాముడి మనసులోని ఆలోచనలు అతనికన్నా వేగంగా పరుగెడుతున్నాయి. ఇది తను తప్పక గెలవాల్సిందే నూతన్ ప్రసాద్ చెప్పినట్టు అదొక ప్రెస్టేజీ దెబ్బ తినే విషయం. ప్రేక్షకుల్లో కూర్చుని అరుస్తున్న రెండు జెళ్ళ సీత తను గెలవకపోతే డీలా పడిపోతుంది. తను గెలవకపోతే

లక్ష్మణ్ మళ్ళీ క్రికెట్ బాట్ పట్టుకోనని గట్టిగా చెప్పాడు. వాళ్ళకోసమైనా తను గెలవాలి. అతని మనసు అతని వెన్ను తట్టుతున్నది. ఎదురుగా మిత్రుడు హనుమంత రావ్ ఈలలు వేసీ వేసీ, ఇక వేయలేక ఈల పాట రఘురామయ్యలా సన్నగా ఈల పాటలు పాడుతున్నాడు. పాడు భీముడు, ఇంకా పరుగెడుతూనే వున్నాడు. రాముడు గెలిచి తీరాలని పట్టుబట్టాడు. గెలుస్తానని మనస్ఫూర్తిగా నమ్మాడు. శక్తి తెచ్చుకుని పరుగెత్తాడు. భీముడిని దాటిపోయాడు. రెండు జెళ్ళ సీత ఈల వేస్తున్నది. లక్ష్మణ్ బాటింగ్ చేయటం కోసం పాడ్స్ కట్టుకుంటున్నాడు. హనుమంతరావ్ ప్రోత్సాహంగా కుప్పిగంతులు వేస్తున్నాడు. రాముడు గెలిచాడు. మనసు చేసే మాయలలో ఇదొకటి.

కావాలంటే మంచం ఎక్కి, అక్కడినించీ కాటికి బయల్దేరిన సత్యవంతుడిని అడగండి. డాక్టర్లు లాభాలు చేసుకున్న తర్వాత, ఇక లాభంలేదని అతన్ని సూట్‌కేస్ సర్దుకోమన్నారు. వాళ్ళ మాట వినకుండా, బ్రతకటం కోసం మనసు పడి, తన మనసు మాట విని, కేవలం మనోధైర్యంతో ధృఢ నిశ్చయంతో ఎలా బ్రతికి బయటపడ్డాడో.

అలాగే అనగనగా ఒక అప్పారావూ, ఒక సుబ్బారావూ. ఇద్దరూ అరవ్వయ్యవ పడిలో పడ్డారు. అప్పారావు అంటాడూ - ఏముందిసార్! అంతా అయిపోయింది. పిల్లలు పెళ్ళిళ్ళయి వెళ్ళిపోయారు. ముద్దుల పెళ్ళాం మునుపటిలా అంత ముద్దు రావటం లేదు. ప్రభుత్వం వారు నువ్వు ముసలాడివయిపోయావోయ్, హాయిగా రిటైర్ అయిపోయి కృష్ణా రామా అనుకో. అనుకోటం ఇష్టం లేకపోతే ఎం. ధర్మరాజుగారు వస్తారు వాకిట్లో కూర్చో అని నా నుదుటి మీద ఒక ముద్ర వేసి పంపించారు అని. సుబ్బారావ్ అంటాడు - నేను నా జీవితంలో ఎన్నెన్నో సాధించాలనుకున్నాను. ప్రభుత్వోద్యోగంలో వుండి అవేవీ చేయలేక పోయాను. రిటైరయాను కదా ఇప్పుడు చక్కటి అవకాశం వచ్చింది. ఒకదాని తర్వాత ఒకటి అవన్నీ చేయటం మొదలుపెట్టాను. నేను జీవితంలో కోరుకున్నవన్నీ ఇప్పుడు చేస్తుంటే కొత్త ఉత్సాహం వస్తున్నది - అని. అంతేకాదు వయసు అన్నది మనసులో వుంది. శరీరానికి కాదు. అందరికీ ఏదో ఒక అనారోగ్యం వుంటూనే వుంటుంది. దానికోసం చక్కటి జీవితాన్ని నాశనం చేసుకుంటామా అని కూడా అంటాడు.

మరి మనసు మన మీద ఇంత అధికారం చలాయిస్తుంటే, దాన్ని మన స్వాధీనంలోకి తీసుకురావటం ఎలా? మోక్షం సంపాదించటం ఎలా? అని కొందరి అనుమానం. ఇంకా కొందరు 'ఏమంటారంటే - మనసు చెప్పిన మంచి మాటలు వింటే తప్పేమిటి. మోక్షం, వచ్చే జన్మ సంగతి అనవసరం. ప్రస్తుతం ఈ జన్మలో మనసు పడి, మంచి మనసుతో మనకిష్టమైన పనులు మనసారా చేయక, ఎందుకలా మనసు పాడుచేసుకోవటం. నీ మనసు చెప్పినట్టు విను. చేయవలసిన మంచి పనులు మనస్ఫూర్తిగా చేయి. నీ జీవితాన్ని మనసారా అనుభవించు' అని.

మనసు ఆడే ఆటలు భరించలేని ఇంకా కొందరేమంటారంటే - మనసా కవ్వించకే - అని.

0 0 0